శుక్రవారం 7, జూన్ 2024

లోకేష్‌ను కలిసిన కలిశెట్టి

విశాలాంధ్ర – రణస్థలం : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుని, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ లను గురువారం విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఉండవల్లిలో జరిగిన పార్లమెంటరీ పార్టీ సమావేశాంలో పాల్గొన్నారు.

శ్రీకాకుళం సమగ్రాభివృద్ధికి ఆరు సూత్రాల ప్రణాళిక

ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర – శ్రీకాకుళం టౌన్ : నియోజక వర్గం సమగ్రాభివృద్ధికి ఆరు సూత్రాల ప్రణాళిక తయారు చేశామని.. దాన్ని ఒక మ్యానిఫెస్టోగా భావించి మిగిలిన ప్రజాప్రతినిధుల సహకారాన్ని తీసుకొని తూచాతప్పకుండా అమలు చేస్తామని శ్రీకాకుళం అసెంబ్లీకు శాసనసభ్యునిగా ఎన్నికైన గొండు శంకర్ అన్నారు. గురువారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా ముఖచిత్రాన్ని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు సహకారాన్ని తీసుకొని మార్పు చేస్తానని, జిల్లా కేంద్రం రూపురేఖలు తద్వారా మారుతాయని అన్నారు. క్రీడాకారులకు.. వాకర్స్ కు ఇచ్చిన హామీ మేరకు కోడి రామ్మూర్తి స్టేడియం ను యుద్ధప్రాతిపదికన సర్వాంగ సుందరంగా తయారు చేసి జిల్లా ప్రజలకు అంకితం చేస్తామని హామీ ఇచ్చారు.. రెండవది శ్రీకాకుళం నుండి ఆమదాలవలస రైల్వే స్టేషన్ కు వెళ్ళే రహదారి పనులు శరవేగంగా పూర్తి చేస్తామని.. దీనికి కావలసిన నిధులు తీసికొని వస్తానని చెప్పారు.. న్యాయ స్థానం అభ్యంతరం తో ఎన్నో ఏళ్లుగా ఎన్నికలకు దూరంగా ఉన్న శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు సాధ్యమైనంత త్వరగా అయ్యేటట్లు చర్యలు తీసుకుంటామని శంకర్ హామీ ఇచ్చారు.. శ్రీకాకుళం జిల్లా కేంద్రం నుండి గ్రామీణ ప్రాంతాలను కలుపుతూ ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేస్తామని అన్నారు. శ్రీకాకుళం నియోజక వర్గం పరిధిలో రైతులకు సాగునీరు ఇబ్బంది లేకుండా చేసేందుకు వంశధార, నాగావళి, నదుల నుండి వస్తున్న సాగునీటి కాలువలు. పొడిగింపు చేస్తామని అన్నారు.

శ్రీకాకుళం జిల్లా సమగ్రాభివృద్ధికి జిల్లా నుండి ఎన్నికైన ప్రజాప్రతినిధులు అంతా సంపూర్ణ సహకారాన్ని అందించాలని ఆయన కోరారు. అంతకన్నా ముందు స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన యువ ఎమ్మెల్యే గొండు శంకర్ ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు జి. ఇందిరా ప్రసాద్, పీజీ గుప్తా, ఎస్. జోగి నాయుడు, గేదెల లక్ష్మీ, బి.దేవీ ప్రసాద్, గోలీ ఉమా మహేశ్వర రావు, గోలీ సంతోష్, ఎన్.ఈశ్వరరావు పలువురు టీడీపీ నేతలు కార్యకర్తలు క్రీడాకారులు., వివిధ క్రీడా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నీట్‌లో మెరిసిన కళ్యాణ్

విశాలాంధ్ర – పలాస : మండలం బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన పేదింటి విద్యార్థి బోడ కళ్యాణ్ నీట్ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 720 మార్కులకు 680 మార్కులు సాధించి మెరిసారు. ఆల్ ఇండియా లెవెల్‌లో 9000 ర్యాంకు రాగా, ఒబిసి కోటాలో 3810 ర్యాంకు సాధించి డాక్టర్ కావాలనే తన కలను సాకారం చేసుకున్నారు. రాజమండ్రి శశి కళాశాలలో సిబిఎస్సీ స్ట్రీమ్‌లో ఇంటర్మీడియట్ లో 500 మార్కులకు గాను 460 మార్కులు సాధించారు. పదో తరగతిలో శ్రీ చైతన్య పాఠశాలలో విద్యనభ్యసించి 577 మార్కులు సాధించారు. ఆల్ ఇండియా స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్ష లో ఉత్తమ ర్యాంకు సాధించడంతో ఎయిమ్స్ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు సాధించారు. తండ్రి బాబూరావు వృత్తి రీత్యా ప్రైవేటు ల్యాబ్ టెక్నీషియన్ కాగా తల్లి శ్యామల గృహిణి. బాబూరావు పలాసలో సొంతంగా ల్యాబరేటరీ పెట్టుకుని జీవనోపాధి పొందుతున్నారు. తన కుమారుడుని ఎలాగైనా డాక్టర్‌ని చేయాలనే తన కలను నెరవేర్చుకున్నారు. కళ్యాణ్ సాధించిన విజయానికి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. కళ్యాణ్ తండ్రి బాబూరావు స్నేహితులు. శ్యాంప్రసాద్, సురేష్, మోహన్, మురళి, మదన్ మోహన్‌లు అభినందనలు తెలిపారు.

నామ విజ్ఞాన వేత్త కొండలరావుతో టాల్ రేడియో ఇంటర్వ్యూ



విశాలాంధ్ర – పొందూరు : నామ విజ్ఞాన వేత్తగా ఎనలేని గుర్తింపు పొందిన వాంద్రంగి కొండల రావుతో టచ్ ఎ లైఫ్ ఫౌండేషన్ టాల్ రేడియో (డల్లాస్/టెక్సాస్)ప్రతి ఊరి పేరు చరిత్ర చెప్పే కబురు, ఇష్టమైన పనితోనే అంతులేని సంతృప్తి శీర్షికలతో ఇంటర్వ్యూలను జరిపింది. రెండు భాగాలుగా ఈనెల 5న రాత్రి 9.30గంటలకు, అలాగే గత నెల 29న ప్రసారం చేసింది. ప్రాశ్నకునిగా(హోస్ట్)గా కె.ఎల్.సూర్య తన మధుర స్వరంతో ఇంటర్వ్యూ జరిపారు. ఊరి పేర్లను తెలుసు కోవాల్సిన ఆవశ్యకత, ఊరి పేరు వెనుక గల చరిత్రను సాధికారికంగా కొండలరావు వివరించారు. మనం ప్రయాణం చేసేటప్పుడు మార్గమధ్యంలో కనిపించే ఊరి పేర్ల నేంబోర్డులను వీక్షించేటప్పుడు పొందే అనుభూతి అనిర్వచనీయమని పేర్కొన్నారు.నామ విజ్ఞానం(ఓనమాస్టిక్సు)లో ప్రధాన భాగమైన గ్రామం నామ విజ్ఞానం(టొపోనమీ)పై పిట్ట చూపుగా వివరించారు.దీర్ఘాసి,కాకి, భోజనం, పొందూరు, కప్పట్రాల్ల తదితర అసంఖ్యాక గ్రామాల పేర్ల వెనుక గల చరిత్రను శాస్త్రీయంగా విశదీకరించారు. వలసలు తదితర కారణాల వల్ల ఒకే పేరుతో అనేక గ్రామాలు ఏర్పాటైనట్టు,ఇంటి పేర్లతో ఉన్న వ్యక్తి నామధేయాలను సోదాహరణంగా వివరించారు.దేవుని పేర్లతో, గ్రామదేవతల పేర్లతో,వృక్షాల పేర్లతో, పశుపక్ష్యాదుల పేర్లతో ఏర్పాటైన కొన్ని గ్రామాలను విశదీకరించారు.గ్రామ నామ విజ్ఞానం ఓ అంతులేని కథ లాంటిదని కొండలరావు ఆ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. గ్రామ నామ విజ్ఞానంలో భాగంగా తాను రాసిన ఊరు –పేరు(ఆంధ్రప్రదేశ్),గ్రామ నామాలు(ఆంధ్రప్రదేశ్) పొందూరు మరో బందర్ పుస్తకాల విశిష్టతను వివరించారు.విశాఖ సంస్కృతి మాసపత్రికలో గత ఆరేడు ఏళ్ల నుంచి తాజాగా అన్వేషణ జరిపిన నెలకు రెండు వంతున ప్రచురిస్తున్న విషయాన్ని వెల్లడించారు. తన ఆరోగ్యం సహకరించే వరకు ఊరి పేర్ల సేకరణను అవిశ్రాంతంగా జరపగలనని కొండలరావు పేర్కొన్నారు. పాఠశాలల్లో బాల సాహిత్యానికి పెద్ద పీట వేయాలని సూచించారు.తనకు టాల్ రేడియోలో అవకాశం కల్పించినందుకు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఖరీఫ్ విత్తనాలు సిద్ధం

విశాలాంధ్ర – ఇచ్ఛాపురం : మండలంలో రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారిణి టి. భార్గవి తెలిపారు. ఖరీఫ్ విత్తనాలు విత్తనాల కోసం రిజిస్ట్రేషన్లు కూడా ప్రారంభించడం జరిగిందని, అవకాశాన్ని మండలంలో రైతులు సద్వినియోగం చేసు కోవాలని గురువారం బిర్లంగిలో రైతులతో నిర్వహించిన సమావేశంలో తెలిపారు. ఇంద్ర, అమర, స్వర్ణ మసురు, సాంబ మసురు, శ్రీకాకుళం సన్నాలు వంటి ఐదు రకాలను అందుబాటులోకి తెచ్చి సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు.

ఘనంగా అమావాస్య పూజలు

విశాలాంధ్ర – ఇచ్ఛాపురం : పట్టణం, మండలంలో గురువారం సావిత్రి అమావాస్య పూజలను మహిళలు అత్యంగ భక్తితో ఘనంగా నిర్వహించారు. ఒఢియా సాంప్రదాయం ప్రకారం వైశాఖ అమావాస్య నాడు కుటుంభ సౌఖ్యం, మాంగళ్య రక్షణ కాంక్షిస్తూ యమధర్మరాజును సంతృప్తి పర్చుతూ, విష్ణువును ప్రసన్నం చేసుకునేందుకు మామిడి, పనస, జీడి, ఈత, తాటి ముంజెలు, వడపప్పు, పానకాలను నేవిదించి అర్చిస్తారు. ఇండ్లలో పూజలు చేసి తమ ఆడ పిల్లలు ఉండే అత్తవారిళ్ళకు ప్రసాదాలు పంపుతారు. పట్టణంలో కస్పాగౌడ వీధిలో శ్రీ లక్ష్మినరసింహస్వామి దేవాలయంలో మహిళలు పెద్ద ఎత్తున పూజలు జరిపారు.

ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు విరాళం

విశాలాంధ్ర – కవిటి : మండల కేంద్రమైన కవిటి బీచ్ రోడ్‌లో నూతనంగా నిర్మాణ పనులు చేపడుతున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు విరాళం అందజేశారు. ఈ మేరకు గురువారం రాజపురం పంచాయతీ ఆర్‌తోటూరు గ్రామానికి చెందిన లాబాల లింగరాజు 10 వేలు రూపాయలు నగదు అలాగే కవిటి గ్రామ పంచాయితీ గొండ్యాలపుట్టుగ గ్రామానికి చెందిన పొందూరు బాలకృష్ణ 5 వేల 5 వందలు రూపాయలు నగదు విరాళంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా విరాళం అందజేసిన దాతలకు శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

మాస్టర్ ట్రైనర్ శేషగిరిని అభినందించిన కలెక్టర్

విశాలాంధ్ర – శ్రీకాకుళం : ఎన్నికల విధులు నిర్వహించిన అధికారులు, సిబ్బందికి నాణ్యమైన శిక్షణ అందించి, జిల్లాలో ఎన్నికలను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్, ఉపాధ్యాయుడైన కే.శేషగిరిరావును జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ అభినందించారు. జిల్లాకు వచ్చిన ఎన్నికల పరిశీలకులు, సీనియర్ ఐఏఎస్ అధికారులు సంతకాలతో కూడిన అభినందన ప్రశంసా పత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన అందజేశారు. శేషగిరిరావు గార మండలం ఉప్పరవాని పేట ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. విజయవాడలో శిక్షణ పొందిన ఆయన జిల్లాస్థాయి ఎన్నికల నియమాలను, విధులను మాస్టర్ శిక్షకుని హోదాలో గత నాలుగు నెలలుగా అధికారులు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. 2019లో కూడా ఆయన శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గస్థాయి మాస్టర్ శిక్షకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా తన అభినందించిన వారిలో జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ కూడా ఉన్నారు.

మండలాల వారిగా టీడీపీ మెజారిటీ

విశాలాంధ్ర – కొత్తూరు : పాతపట్నం నియోజిక వర్గంలో టిడిపి అభ్యర్థిగా విజయం సాధించిన మామిడి గోవిందరావుకు ఆయా మండలాల్లో సాధించిన మెజారిటీ ఓట్లు ఇలా ఉన్నాయి. పాతపట్నం మండలంలో 8575 ఓట్లు, మెలియా పుట్టి. మండలంలో – 5018 ఓట్లు లక్ష్మి నర్సు పేట మండలంలో 1513 ఓట్లు, కొత్తూరు మండలంలో – 6684. ఓట్లు హిర మండలం. మండలంలో – 3189 ఓట్లు మెజిరిటీ ఓట్లు వచ్చాయి.

10న బొడ్డపాడు సదస్సును విజయవంతం చేయండి

విశాలాంధ్ర – పలాస : కమ్యూనిస్టు పార్టీలు, విప్లవ ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 10న పలాస మండలం బొడ్డపాడు అమరవీరులస్మారక భవనంలో ఉదయం 9గంటలకు కమ్యూనిస్టు భావజాలంపై అసత్య ప్రచారం – రాజ్య హింసకు వ్యతిరేకంగా..." సదస్సు నిర్వహిస్తున్నట్టు, పిఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి పోతనపల్లి.కుసుమ,సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు తామాడ సన్యాసిరావు తెలిపారు. గురువారం వారు మాట్లా డుతూ ఫాసిస్ట్ హిందూ మతోన్మాద భావజాల ప్రభావానికి సమాజం గురవుతున్న ఈ కీలక సమయంలో ఇటువంటి వేదికల ద్వారా ప్రజలకు వాస్తవాలను తెలియజేసి చైతన్య పరచవలసిన బాధ్యత, కర్తవ్యంలో భాగంగానే తమ వంతు బాధ్యతగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నమని తెలిపారు. అన్ని కమ్యూనిస్టు పార్టీలు, విప్లవ సంఘాలు, ప్రజలు సదస్సులో పాల్గొవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మద్దిల రామారావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పోతన పల్లి కుసుమ, గొరకల బాలకృష్ణ, ఎపిసియల్సి జిల్లా నాయకులు పత్తిరి దానేసు, డిల్లీ రావు,ప్రజా కళా మండలి నాయకులు కొర్రాయి నీలకంఠం, అరుణ, పిడియమ్ నాయకులు సాలిన వీరాస్వామి అలాగే ప్రజాసంఘాల నాయకులు దున్న శ్రీనివాస్, పోతనపల్లి వైకుంఠ రావు,పోతనపల్లి అప్పారావు, కైలాస్,పోలారావు లు పాల్గొన్నారు.

తాడేపల్లిలో అచెన్నాయుడుకి సన్మానం చేసిన గోవిందపురం ఎంపీటీసీ

విశాలాంధ్ర – సంతబొమ్మాలి : ఈ మండలం గోవింద పురం ఎంపీటీసీ మండ త్రినాధరావు సాయిరాం తో పాటు యువ కులు, మహిళలు తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, టెక్కలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే గా హ్యాట్రిక్ విజయం, అత్యధిక మెజారిటీతో ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యే గా విజయం సాధించడం పట్ల దుస్సాలువ పూలమాలలతో ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మండ త్రినాధలతో పాటు ఆ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

కామ్రేడ్ దమయంతి సంతాప సభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర – పలాస : సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకురాలు కరజాడ మాజీ ఎంపీటీసీ కామ్రేడ్ తమ్మినేని దమయంతి అనారోగ్యంతో మే 25 న మృతి చెందిందని ఆమె సంతాప సభలను ఈ నెల 8న మెళియాపుట్టి మండలం కరజాడ, 9న పలాస అమరవీరుల స్మారక భవనం లో నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు తెలిపారు. ఈ మేరకు గురు వారం పలాస న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దమయంతి గత 30 సంవత్సరాలుగా సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీలో కొనసాగిందని, ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) జిల్లా కార్యవర్గ సభ్యురాలుగా వ్యవహరించిందని తెలిపారు. ఆమె మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని అన్నారు. పీడిత తాడిత ప్రజల కోసం రైతుల కోసం వ్యవసాయ కూలీలు, కార్మికులు,మహిళల హక్కుల కోసం అనేక పోరాటాలలో దమయంతి పాల్గొన్నదని గుర్తు చేశారు. ఆమె సంతాప సభకు న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు హాజరవుతున్నారని తెలిపారు. ఆయనతో పాటుగా ఐ ఎఫ్ టి యు జిల్లా కన్వీనర్ జుత్తు. వీరాస్వామి, జిల్లా నాయకులు పతివాడ. షణ్ముఖరావు ,బెహర, పిఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి హత్య

విశాలాంధ్ర – సోంపేట : మద్యం మత్తులో ఒకే చోట పని చేస్తున్న ఇద్దరు కార్మికులు తీవ్ర వాగ్వివాదాలకు దిగి ఒకరిపై ఒకరు కేకలు వేసుకుంటూ కోపోద్రిక్తులై ఆవేశాలకు వెళ్లిన పరిస్థితుల్లో పక్కనే ఉన్న రాయితో ఎదుటి వ్యక్తి తలపై మోదడంతో సదరు వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు విడిచిన సంఘటన సోంపేట మండలం కొర్లాం గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. సోంపేట సీఐ మల్లేశ్వరరావు, బారువ ఎస్సై తెలిపిన సమాచారం మేరకు కొర్లాం జాతీయ రహదారి పక్కనే ఉన్న సంగీత దాబా హోటల్‌లో కార్మికుడుగా పని చేస్తున్న మాడుగుల రాంబాబు (51) హత్యకు గురయ్యాడు. అదే హోటల్‌లో పని చేస్తున్న సమంతో మహంతి రాయితో మోదడంతో రాంబాబు ప్రాణాలు కోల్పోయాడు. ఇద్దరు మధ్య నెలకొన్న తగాదా కారణంగా సమంతో మహంతి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. మృతి చెందిన రాంబాబు పోలాకి మండలం చీమయ్యవలస గ్రామానికి చెందిన వ్యక్తి, సమంతో మహంతి మందస మండలం పొత్తంగి గ్రామానికి చెందిన వ్యక్తి. ఈ ఇద్దరి మధ్య నెలకొన్న విభేదాలు దానికి తోడుగా మద్యం సేవించి మత్తెక్కడం వంటి పరిస్థితుల్లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. హోటల్ యజమాని మట్ట గణపతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని సోంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించారు.

ప్రజలు ఇచ్చిన తీర్పు ఎన్డీయే కూటమిపై మరింత బాధ్యత పెంచింది

జనసేన టెక్కలి నియోజకవర్గ నాయకులు కోటేశ్వరరావు

విశాలాంధ్ర – కోటబొమ్మాళి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు ఇచ్చిన ప్రజాతీర్పు ఎన్డీయే కూటమమిపై మరింత బాధ్యత పెంచిందని జనసేన టెక్కలి నియోజకవర్గ నాయకులు పల్లి కోటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక విలేకర్లుతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు ఎంతో విజ్ఞులని రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలుగా జరుగుతున్న పరిణామాలు చూసి విసిగిపోయారని, ఏపీ అభివృద్ధితో పాటు అన్ని వర్గాల ప్రజలు జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో నష్టపోయారని, ఓటు అనే ఆయుధంతో నియంతగా పాలన సాగించిన జగన్మోహన్‌రెడ్డికి, వైఎస్సార్‌సీపీ పార్టీకి సరైన గుణపాఠం చెప్పారని, కేంద్రం యొక్క సహాయ సహకారాలతో కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి విజయానికి కృషి చేసిన ప్రజలకు, తెలుగుదేశం, జనసేన, బారతీయజనతా పార్టీ నాయకులకు, కార్యకర్తలకుకోటేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. అత్యంత మెజారిటీలో శ్రీకాకుళం పార్లమెంటు సభ్యులుగా గెలుపొందిన కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు, టెక్కలి ఎమ్మెల్యేగా గెలిపొందిన కింజరాపు అచ్చెన్నాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రామ్మోహన్‌నాయుడు కేంద్రంలో మంత్రిపదవి చేపట్టాలని, రాష్ట్రంలో అచ్చెన్నాయుడుకు ఉన్నతమైన మంత్రి పదవి తక్కుతుందని ఆయన అశాభావం వ్యక్తం చేశారు.

స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించండి

పారిశ్రామిక ప్రతినిధులను కోరిన ఎంఎల్ఏ ఎన్ఈఆర్

విశాలాంధ్ర – రణస్థలం : మండలం పైడి భీమవరం పారిశ్రామిక వాడకు చెందిన పలు కంపెనీల ప్రతినిధులు ఎచ్చెర్ల నియోజకవర్గానికి నూతన శాసనసభ్యులుగా ఎన్నికైన నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) ని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ పరస్పర సహకారం తో నియోజకవర్గం అభివృద్ధికి కలసి పని చేయడానికి ముందుకు రావాలని, స్థానిక యువకులకు కంపెనీలలో అవకాశం కల్పించే దిశగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి పరిశ్రమ అవసరాలకు తగ్గ ఉద్యోగాలను ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధిలో అందించాలని వారిని కోరారు. సీఎస్ఆర్ యాక్టివిటీస్ లో భాగంగా ప్రభుత్వ భాగస్వామ్యంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి తోడ్పడేలా పనిచేద్దామని కోరారు. అందుకు పరిశ్రమ ప్రతినిధులు తమ సహకారం అందిస్తామని తెలియజేశారు. ఈ సమావేశంలో శ్రేయాస్ పార్మా డైరెక్టర్ గోపాల్ రెడ్డి, అపిటోరియస్ ఫార్మా కంపెనీ జనరల్ మేనేజర్ కమలాకర్ రెడ్డి తదితర ప్రతినిధులు పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్ 2 కి ఉచిత శిక్షణ

విశాలాంధ్ర – శ్రీకాకుళం టౌన్ : ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్ 2 ప్రిలిమినరీ పరీక్ష లో అర్హత సాధించిన అభ్యర్థులకు మెయిన్స్ పరీక్ష కు బీసీ స్టడీ సర్కిల్ లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు ఇ. అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. 60 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, మైనార్టీ అభ్యర్థులు ఆఫ్ లైన్ ద్వారా 80 అడుగుల రోడ్డులో గల కార్యాలయం లో దరఖాస్తు చేసుకుంటే వారికి ఈ నెల 10 వ తేదీ నుంచి ఆర్ట్స్ కళాశాల లో శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల గ్రూప్ 2 ప్రిలిమ్స్ హాల్ టికెట్ పొందుపరిచి, బీసీ ల వార్షిక కుటుంబ ఆదాయం లక్ష లోపు ఎస్సీ, ఎస్టీ లు 2 లక్షల లోపు ఉండాలని తెలిపారు. ఇతర వివరాలకు ఈ ఫోన్ నెంబర్ 7382975679, 9295653489 లలో సంప్రదించాలని కోరారు.

అన్ని శాఖల సమిష్టి కృషితోనే కౌంటింగ్ నిర్వహణ విజయవంతం

ఎన్నికల అధికారి డా.మనజీర్ జిలాని సమూన్

విశాలాంధ్ర – శ్రీకాకుళం : ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల నిర్వహణలో వివిధ శాఖల సహాయ, సహకారాలు, భాగస్వామ్యం మరువలేనిదని జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలాని సమూన్ అన్నారు. కౌంటింగ్ ప్రశాంతంగా, సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరిని ఆయన అభినందించారు. విజయవంతంగా కౌంటింగ్ నిర్వహణకు సూచనలు, సలహాలు అందజేసిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వారికి జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జీలాని సమూన్ ధన్యవాదాలు తెలియజేసారు. అలాగే జిల్లాలో గెలుపొందిన పార్లమెంట్ అభ్యర్థి, 8 నియోజకవర్గాల శాసన సభ్యులకు అభినందనలు తెలియజేశారు.

అన్ని శాఖలు సమన్వయం : సమిష్టి కృషితోనే సాధ్యమైందని హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయన ప్రత్యేకంగా ఆర్వోలు, నోడల్ అధికారులతో సమావేశమై ప్రతి ఒక్కరిని పేరుపేరునా అభినందించారు. జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహించడం చాలా సంతోషకరమని, జీవితకాలం ఈ జ్ఞాపకాలు మరువలేనన్నారు. అదృష్టం కొద్దీ ఎన్నికల నిర్వహణపై మంచి పరిజ్ఞానం ఉన్న బృందం లభించిందన్నారు. అంతా కష్టపడేవారే. ముఖ్యంగా వారి కుటుం బాలను అభినందించాలి. సుమారు 6 నెలల నుండి బియల్ఓలు ఇంటి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించారన్నారు. పోలింగ్ తర్వాత కౌంటింగ్ కూడా డిబ్రీఫింగ్ నిర్వహించడం జరిగిందని. కౌంటింగ్ ప్రెస్ సజావుగా జరిగిందని సంతృప్తి వ్యక్తం చేశారు, ఈ విజయం ప్రతి ఒక్కరిది అన్నారు. బిఎల్ఓ, మండలం, డివిజన్, జిల్లా స్థాయి అందరు అధికారుల, పోలీస్ అధికారులు సమన్వయంతో ఎన్నికల ప్రక్రియ విజయ వంతం జరిగిందన్నారు. ఈ ప్రక్రియలో జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ ప్రధాన పాత్ర అన్నారు. పోలింగ్, కౌంటింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేసిన ప్రతీ ఒక్కరికి కొనియాడారు. ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న ప్రతీ అధికారి నిష్పక్షపాతం, నిబద్ధతతో విధులు నిర్వహించారన్నారు. జిల్లాలో సాధారణ ఎన్నికలు 2024 ఘనంగా నిర్వహించడం జరిగిందని దానికి మీ అందరి సహకారమే అని కొనియాడారు. కౌంటింగ్ విజయవంతం చేయడంలో పెద్ద పాత్ర, హింసాత్మక ఘటనలు జరగకుండా అడ్డుకట్ట వేయడంలో ఎస్పీ కీలక బాధ్యతలు పోషించారన్నారు.

సబ్ కలెక్టర్, ఆర్వో లు చేసిన కృషి, గత నాలుగు నెలలుగా నోడల్ అధికారులు అంకితభావం చేపట్టిన విధులు ఇవన్నీ పోలింగ్, కౌంటింగ్ పూర్తి విజయవంతం చేయడానికి సహక రించాయి. ఎన్నికలు మంచి ప్రశాంత వాతావరణంలో జరిగిందన్నారు. ప్రతీ ఒక్క అధికారికి ఇది ఒక టాస్క్ అన్నారు. ఎన్నికల కమిషన్ విధివిధానాలు ప్రతి ఒక్కరు దృష్టి సారించి విధులు సక్రమంగా నిర్వహించారన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ పోలింగ్, కౌంటింగ్ లో ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సమన్వయంతో పనిచేసి విజయానికి ప్రతీ ఒక్కరు ముందుకు వచ్చారన్నారు. శిక్షణా తరగతుల్లో అందరు సమన్వయం వహించారాని కొనియాడారు. శిక్షణా తరగతులు అందరికీ ఊయోగపడ్డాయన్నారు. నిర్దేశించిన పనులు ప్రతీ ఒక్కరు అంకిత భావంతో పనిచేయడం ఈ విజయానికి కారణమన్నారు. కలెక్టరేట్ లో ఎన్నికల విధులు నిర్వహించిన ప్రతీ ఒక్కరికి కొనియాడారు. అలాగే కౌంటింగ్ కేంద్రాల్లో కావలసిన మౌళిక సదుయాలు ఏర్పాట్లు చేసిన సంబదిత నోడల్ అధికారులకు ప్రశంశించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు మాట్లాడుతూ కౌంటింగ్ నిర్వహణలో వారి వారి అనుభవాలను పంచుకున్నారు. కొన్ని సందర్భాల్లో కష్టమైనా తాజా ఫలితం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. చిన్నచిన్న అంశాల్లో సైతం జిల్లా కలెక్టర్ సీరియస్ గా స్పందించిన విషయాలు క్షేత్రస్థాయిలో తమకు ఎంతగా ఉపయోగపడినదన్నారు. భోజనం వేడిగా, రుచిగా తిన్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అక్కడే ఉన్న కలెక్టర్ వ్యవహరించిన విధానాన్ని, సున్నితమైన అంశాలపై కూడా ఆయన స్పందించిన తీరుపై పలువురు నోడల్ అధికారులు జ్ఞప్తికి తెచ్చుకున్నారు. విజయంలో తమను భాగస్వాములు చేసిన జిల్లా ఎన్నికల అధికారి డా.మనజీర్ జిలాని సమూన్ కు వారంతా ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆముదలవలస నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్, టెక్కలి రిటర్నింగ్ అధికారి నూరుల్ ఖమర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతిరావు, జిల్లా పరిషత్ సిఈఓ వెంకటేశ్వం రావు, ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, నరసన్నపేట, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు సుదర్శన్ దొర, డాక్టర్ భరత్ నాయక్, అప్పారావు, సి. హెచ్. రంగయ్య, లక్ష్మణమూర్తి, రామ్మోహనరావు, నోడల్ అధికారులు జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, సూడా వి.సి ఓబులేసు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి బి. మీనాక్షి, ఎల్డిఎం సూర్య కిరణ్, డ్వామా పి.డి చిట్టిరాజు, జిఎస్టి కమీషనర్ రాణిమోహన్, ఐసిడిఎస్ పి.డి శాంతిశ్రీ, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె. చెన్నకేశవ రావు, హౌసింగ్ పి.డిగణపతి రావు, ఎపి ఈపిడిసిఎల్ ఎస్ఇ కృష్ణమూర్తి, డిప్యూటీ సిఇఓ వెంకట్ రామన్, జిల్లా ఉపాధి కల్పనధికారి సుధా తదితరులు పాల్గొన్నారు.

మందసలో దొంగల హల్ చల్

విశాలాంధ్ర - మందస : మందస బజార్ వీధిలో బుధవారం అర్ధరాత్రి దొంగలు హల్ చల్ చేశారు. మార్కెట్లో గల కామేశ్వరి మందుల షాపు, పూనా జయకుమార్ కిరాణా షాపుల తలుపులు తెరచి పెట్టిలో గల కొంత నగదుతో పాటు మందులను ఎత్తుకెళ్లారు. అదే విధంగా పక్కనే ఉన్న శ్రీ సాయిబాబా బట్టల షాపులో ప్రవేశించేందుకు విఫల యత్నం చేశారు. ఈ సంఘటనతో మార్కెట్ వీధిలో గల షాపుల యజమానులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. సమాచారం తెలుసుకున్న మందస పోలీసులు చోరీకి గురి అయిన షాపుల వద్దకు చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు. రాత్రిపూట పోలీసులకు గస్తీ ఏర్పాటు చేయాలని వ్యాపారస్తులు కోరుతున్నారు.

9న జీ తెలుగులో డ్రామా జూనియర్స్ సీజన్ 7

విశాలాంధ్ర - శ్రీకాకుళం : అత్యంత ప్రేక్షకాదరణ పొందిన జీ తెలుగు డ్రామా జూనియర్స్ కొత్త సీజన్ ప్రారంభం కానుందనీ సంస్థ ప్రతినిదులు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవంతంగా 6 సీజన్లు పూర్తి చేసుకున్న జి తెలుగు డ్రామా జూనియర్స్ 7వ సీజన్ ఈ నెల 9న, సాఎం 6:00 గంటలకు! ప్రతి ఆదివారం రాత్రి 9:00 గంటలకు సారమవుతుందన్నారు. భావోద్వేగం నిండిన కథతో ప్రేక్షకుల హృదయాలను తాకే కథతో రూపొందుతున్న సరికొత్త సీరియల్ మేఘసందేశం ఈ నెల 10 నుంచి సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు రాత్రి 7:30 గంటలకు!! ప్రసారం కానున్నదన్నారు. కొన్నేళ్లుగా అందరి హృదయాలను గెలుచుకున్న పాపులర్ కిడ్స్ రియాలిటీ షో ఏడో సీజన్ కోసం తెలుగు బుల్లితెరపైకి రీఎంట్రీ ఇస్తోందన్నారు. డ్రామా జూనియర్స్ సీజన్ 7కు కూడా సీనియర్ నటి జయప్రద జడ్జిగా కొనసాగనున్నారన్నారు. టాలీవుడ్ కమెడియన్, దర్శకుడు బలగం వేణు, అందాల నటి పూర్ణ కూడా న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి పిల్లల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించనున్నారన్నారు. చిన్న పిల్లలను కళాకారులుగా ఎదగడానికి, ప్రేక్షకులను అలరించడానికి జీ తెలుగు అద్భుత అవకాశాన్ని అందిస్తోందన్నారు.ఇక ఈ సీజన్ కి ప్రముఖ నటుడు, నిర్మాత శ్రీరామ్ వెంకట్ వ్యాఖ్యాతగా, పడమటి సంధ్యారాగం సీరియల్ అధ్య, రామలక్ష్మి మెంటర్స్గా వ్యవహరిస్తున్నారు.

కూటమి ఎంపీ, ఎమ్మేల్యేలకు శుభాకాంక్షలు

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : ఇటీవల జరిగిన ఎన్నికల్లో భాగంగా భారతీయ జనతా పార్టీ భాగస్వామ్య కూటమి ఎన్డీయే ప్రభుత్వం సాధించిన విజయం సందర్భంగా బిజేపి మండల పార్టీ అద్యక్షుడు మెట్ట తిరుమల రావు గురువారం మాట్లాడుతూ మన ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలో భారతదేశం అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తుందని నమ్మి కేంద్రంలో వరుసగా మూడవ సారి మరియు రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ప్రజలు ఓటు వేసి గెలిపించారన్నారు. వారు ఎన్డీయే ప్రభుత్వం పై పెట్టుకున్న నమ్మకాన్ని పూర్తి స్థాయిలో నిలబెట్టుకునేలా అనునిత్యం ప్రజల కోసం పని చేస్తామని తెలియజేశారు. గెలుపొందిన కూటమి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్నాయుడులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. మరియు ఇంతటి గొప్ప విజయాన్ని అందించిన ప్రజలకి, నాయకులకి కార్యకర్తలకి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

మోడల్ స్కూల్‌లో ఖాళీ సీట్లుకు ధరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - సోంపేట : సోంపేటలో గల ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రస్తుత విద్యా సంవత్సరానికి 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లుకు ఆసక్తి గలవారు ధరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ చిన్నాజీవర్మ ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతిలో ఒక సీటు, 8వ తరగతిలో 2 సీట్లు, 9వ తరగతిలో నాలుగు సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 15లోగా పాఠశాల కార్యాలయంలో ధరఖాస్తులు అందజేయాలని కోరారు. పూర్తి వివరాలకు ఏపీ మోడల్ స్కూల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

రామ్మోహన్ మాస్టర్ సేవలు అజేయం

విశాలాంధ్ర - పొందూరు : మండలం కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాల పౌరశాస్త్ర అధ్యాపకునిగా నందా రామ్మోహనరావు మాస్టర్ అందజేసిన విద్య బోధన కళాశాల అభివృద్ధికి చేసిన సేవలు అజేయమని స్థానిక సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపీటీసీ కూటికుప్పల హనుమంతురావులు కొనియాడారు. కళాశాలలో అందరితో మమేకమై శాంతి స్నేహం సంఘీభావంతో మెలుగుతూ చక్కనైన విద్యను అభ్యసించే మాస్టర్ ఉద్యోగ విరమణ చేయటమనేది బాధాకరమన్నారు. మాస్టర్ ఆశయాల సాధన విద్యాభివృద్ధిపై ఉన్న ప్రత్యేక ప్రోత్సాహం పిల్లలు మరువలేరన్నారు. కళాశాలకు ఓ బెస్ట్ సోషల్ వర్కర్ ను కోల్పోయామన్నారు. కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాల పౌరశాస్త్ర అధ్యాపకునిగా పనిచేసి ఓ కమిట్మెంట్ ఉద్యోగ విరమణ పొందిన నంద రామ్మోహనరావుకు గురువారం ప్రిన్సిపాల్ జె.సునీత అధ్యక్షతన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉన్నతికి ఆయన అందించిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు బి.వి.రమణమూర్తి, పి.చిరంజీవి, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, గ్రామస్థులు, విద్యార్దులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పాలిసెట్ కౌన్సిలింగ్...2307 మంది హాజరు

విశాలాంధ్ర - ఎచ్చర్ల : పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహిస్తున్న పాలిసెట్ 2024 కౌన్సిలింగ్ గురువారంతో ముగిసింది ప్రారంభమైంది జిల్లాకు సంబంధించి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల శ్రీకాకుళం లోని హెల్ప్ లైన్ కేంద్రంలో సర్టిఫికెట్లను పరిశీలించారు మొత్తం 2307 మంది విద్యార్థులు కౌన్సిలింగ్కు హాజరై తమ సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేశారు సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈనెల 7 నుంచి 10వ తేదీలోగా కళాశాలలో కోర్సులు ఎంపిక కోసం వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాలి 11న ఆప్షన్ల నమోదులో మార్పులు చేర్పులు చేసుకునే వీలుంది ఈనెల 13న సీట్ల కేటాయింపు వివరాలను సెట్ కన్వీనర్ ప్రకటిస్తారు ఈ నెల 14 నుంచి 19వ తేదీలోగా ఆయా కళాశాలలో రిపోర్ట్ చేయాలి. ఈనెల 14వ తేదీ నుంచి తరగతులను ప్రారంభిస్తారు పాలిసెట్లో ర్యాంక్ పొంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకాని విద్యార్థులు ఈనెల 11వ తేదీలోగా హెల్ప్ లైన్ కేంద్రాన్ని సంప్రదించాలని సమన్వయకర్త జి దామోదరరావు సహాయ సమన్వయకర్త డి.మురళీకృష్ణ తెలిపారు విద్యార్థులకు లాగిన్ ఐడి ఓటిపిలను గోపిక ఉంచుకోవాలన్నారు.

నీటిలో ప్రతిభ సాధించిన చరణ్ దీప్

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : కోటబొమ్మాళి మేజర్ పంచాయతీకి చెందిన చౌదరి రాము సునీతల రెండవ కుమారుడు చౌదరి చరణ్ దీప్ తాజాగా విడుదలైన నీట్ ఫలితాలలో అల్ఇండియా స్థాయి నీట్‌లో 584 మార్కులు సాధించాడు. గతంలో కూడా వారి పెద్ద కుమారుడు చౌదరి సత్యనారాయణ కూడా రెండేళ్ల క్రితం నీటిలో 694 ర్యాంకు సాధించి ప్రస్తుతం గౌహతిలో గల ఎయిమ్స్‌లో విద్యను కొనసాగిస్తున్నాడు. వీరి తల్లి ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకురాలుగా పనిచేస్తుండగా, తండ్రి రాము వ్యాపార వృత్తిలో కొనసాగుతున్నారు. వీరు ర్యాంకులు సాధించి ఉన్నత స్థాయికి ఎదగడం పట్ల స్థానిక నేతలు బోయిన గోవింద రాజులు, బోయిన రమేష్‌తోపాటు పలువురు నేతలు అభినందించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

విశాలాంధ్ర - రణస్థలం : మండలం కమ్మసిగడాం పంచాయతీకి చెందిన బి.ఆదినారాయణ (29) రాత్రి.. బైక్‌పై కమ్మసిగడాం నుంచి రణస్థలం వైపు వేశ్తూండగా గుర్తు తెలియని వాహనాం డీకొని మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న జెఆర్ పురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతినికి ఆరునెలల క్రితమే గుణమాధురి ఆనే మహిళతో వివాహం జరిగింది.

గ్రంథాలయంలో పేపర్ బొమ్మల తయారీ

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : సంతబొమ్మాళి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాల వారోత్సవాల సందర్భంగా వేసవి శిక్షణ శిబిరం సందర్భంగా విద్యార్థులు పేపర్ బొమ్మలను తయారు చేశారు. ఈ కార్యక్రమాన్ని సంతబొమ్మలి శాఖ గ్రంథాలయ అధికారి కే. రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. పేపర్ బొమ్మలు తయారీ కార్యక్రమంలో 24 మంది విద్యార్థులు పాల్గొన్నారు గ్రంథాలయాల శాఖ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రంథాలయ సహాయకులు పాఠకులు విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ ఐదవ సెమిస్టర్ ఫలితాలు విడుదల

విశాలాంధ్ర - ఎచ్చర్ల : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థుల ఐదో సెమిస్టర్ ఫలితాలను గురువారం విడుదల చేశారు బి ఏ, బి బి ఏ, బి సి ఏ, బీకాం, బీఎస్సీ కోర్సులకు సంబంధించి 10822 మంది విద్యార్థులు హాజరుకాగా ఇందులో 5316 మంది ఉత్తీర్ణులై 49.12 శాతం ఫలితాలు సాధించారు ఫలితాల వివరాలను జ్ఞానభూమి పోర్టల్ లో పొందుపరిచినట్లు పరీక్షల విభాగం దీని డాక్టర్ ఎస్ ఉదయ్ భాస్కర్ తెలిపారు ఫలితాలపై విద్యార్థులకు ఏమైనా సందేహాలు ఉంటే నిర్దేశించిన ఫీజు చెల్లించి 15 రోజుల్లో పూనహూల్యాంకనానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

డా. సీదిరి ఓటమికి ద్వితీయ శ్రేణి నాయకులే కారణమా..!

ఆ నలుగురే కొంపముంచారా..?

విశాలాంధ్ర - పలాస : మాజీ మంత్రి పలాస నియోజకవర్గం వైసిపి అభ్యర్థి డా.సీదిరి ఓటమికి ద్వితీయ శ్రేణి నాయకులే కారణమా..? గత ఐదేళ్లలో చక్రం తిప్పిన ఆ నలుగురు కూడా కారణమా..? అంటే అవునేనని స్థానికులు పేర్కొంటున్నారు. 2019 ఎన్నికల్లో విద్యావంతుడు, వృత్తిరీత్యా డాక్టర్ గా ఉన్న అప్పలరాజు రాజకీయాల్లోకి వచ్చిన ఏడాదిలోనే ఎన్నికల రావడం అప్పటి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి గౌతు శిరీషపై 17వేల ఓట్ల పైచిలుకు మెజార్టీతో విజయం సాధించడం జరిగిపోయింది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మంత్రివర్గంలో క్యాబినెట్ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో రెండేళ్లు కోవిడ్ సమయం పోగా మరో మూడు ఏళ్లలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టిన 2024 ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు ఆయనను పక్కన పెట్టేశారు. డాక్టర్ సీదిరి పాలనలో ప్రతి గ్రామంలో అభివృద్ధి జరిగిన రెండు వర్గాలను పెంచి పోషించారు. ఆ నలుగురి వలన గత ఎన్నికల్లో డాక్టర్ విజయానికి కృషి చేసిన చాలామంది ద్వితీయ శ్రేణి నాయకులు మంత్రికి దూరమై కొంతమంది తెలుగుదేశం పార్టీలో చేరగా, మరి కొంతమంది ఇటీవల జరిగిన ఎన్నికల్లో తటస్థంగా ఉండిపోయారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో కొంత మంది వైసీపీ కౌన్సిలర్లు తమ వార్డుల్లో పనిచేయక చేతులెత్తేశారు. కర్ణుడు చావుకు సవా లక్ష కారణాలు అన్న చందంగా డాక్టర్ సీదిరి ఆ నలుగురు బంధనంలో చిక్కుకుపోయారు. వారు చెప్పినట్లే నడుచుకోవడంతో జరగవలసిన నష్టం జరిగిపోయింది. ఈ ఎన్నికల్లో కొన్ని ప్రాంతాల్లో డబ్బులు పంపిణీ చేయమని స్వయంగా మంత్రి చెప్పినప్పటికీ కూడా ఆ నలుగురు డబ్బులు పంపిణీ చేయకుండా పోలింగ్ సమయంలో మొఖం చాటేసారు. దీంతో ఆయా ప్రాంతాల్లో గల స్థానిక నేతలు ఇబ్బందులకు గురి అయ్యారు. ఈ తరుణంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఈ ప్రాంతం ఆ ప్రాంతం అని చూడకుండా అన్ని ప్రాంతాలకు సమానంగా డబ్బులు పంపిణీ చేయడం దీనిపై టిడిపి అభ్యర్థి గౌతు శిరీష భర్త వెంకన్న చౌదరి గురిపెట్టడంతో శిరీష విజయం శునయాసమైందని ఆ పార్టీ శ్రేణులు భావిస్తున్నారు. ఇది ఇలా ఉండగా ఈనెల 4న కౌంటింగ్ ప్రారంభం అయినప్పటి నుంచి ప్రతి రౌండ్ లోను టిడిపి అభ్యర్థి గౌతు శిరీష మెజార్టీ సాధిస్తూనే వచ్చారు. చివరకు 40350 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు .అసలు శిరీష గెలవగలదా? ఆమెకు అంత సీన్ లేదని ఎద్దేవా చేశారు. వజ్రపుకొత్తూరు మాదేనని చెప్పారు. మందసలో ఏకపక్షమేనని బీరాలు పలికారు ప్రత్యర్థులు. పలాస-కాశీబుగ్గలో అయితే తమ మార్కు చూపుతామని చెప్పుకొచ్చారు. కానీ అక్కడా ఇక్కడా అన్న తేడా లేదు. క్లీన్ స్వీప్ దిశగా ముందుకు సాగారు. తొలి రౌండ్లో 7199 ఓట్లు తో ప్రారంభం కాగా మొదటి రౌండ్ లోనే 4,388 ఓట్లు. తర్వాత ఎక్కడా వెనక్కి తగ్గలేదు. రెండో రౌండ్లో 7199 మెజార్టీ. మూడో రౌండ్లో 8259 ఓట్లకు పెరిగింది. నాలుగో రౌండ్ లో 8,896కు పెరిగింది. ఐదో రౌండ్లో 12,105కు చేరుకుంది. ఆరో రౌండ్లో 12,165, ఏడో రౌండ్లో 18,625కు ఎగబాకింది. 8వ రౌండ్లో 19,153కు . 9 రౌండ్ లో 19473, 10 రౌండ్ లో రౌండ్ 20,407,5 పదకొండో రౌండ్ లో 22,041, పన్నెండో రౌండ్‌లో 23636, పదమూడో రౌండ్ లో 23,711, పద్నాలుగో రౌండ్ లో 24,657, పదిహేనో రౌండ్ లో 25,998, పదహారో రౌండ్ లో 27,918, పదిహేడో రౌండ్ లో 32,087, పద్దెనిమిదో రౌండ్ లో 33,561 చేరుకుంది. పంతొమ్మిదో రౌండ్ లో 36,194 ఆధిక్యత సాధించారు. 20వ రౌండ్లో 38,348 ఓట్ల ఆధిక్యతతో దూసుకెళ్లారు. 21వ రౌండ్లో 39,263 ఓట్ల ఆధిక్యతను సాధించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించిన అనంతరం 40,350 ఓట్ల మెజార్టీతో సమీప ప్రత్యర్థి సిట్టింగ్ మంత్రి సీదిరి అప్పలరాజుపై ఘన విజయం సాధించారు.ఏ దశలోనూ సమీప వైసీపీ అభ్యర్థికి ఆధిక్యత కు లభించకుండా సైకిల్ స్పీడ్ అమాంతం పెరుగుతూనే కనిపించింది. పలాస నియోజకవర్గం లో పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ, పలాస, మందస, వజ్రపు కొత్తూరు, మండలాలు కలిపి మొత్తం 1,67,716 ఓట్లు ఉండగా పలాసలో ఎవరికి ఎన్ని ఓట్లు అంటే? గౌతు శిరీష (టిడిపి) 101560, సీదిరి అప్పలరాజు (వైకాపా) 61210, త్రినాధ్ బాబు మజ్జి (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్) 1064, డి వీరస్వామి (ఇండిపెండెంట్) 357, తెలగవలస జయరాం (ఇండిపెండెంట్) 322, నగిరి శ్రీనివాసరావు (బహుజన్ సమాజ్ పార్టీ) 275, పోతనపల్లి కామేశ్వరరావు (సిపిఐ) 155, కర్ని వెంకటరమణమూర్తి (ఇండిపెండెంట్) 142, అనిల్ రాజు (జై భారత్ నేషనల్ పార్టీ) 123, అప్పలరాజు మోటూరు (భారత చైతన్య యోజన పార్టీ) 65 కాగా నోటా 2762 ఓట్లు పోలయ్యాయి. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఇంటిలో సంబరాలు మొదలయ్యాయి.

గ్రంథాలయాలతో జ్ఞానాన్ని మరింతగా పెంపొందించుకోవచ్చు

ఎంఈఓ 2 పద్మనాభం

విశాలాంధ్ర - మెళియాపుట్టి : గ్రామాలలో ఉన్న గ్రంథాలయాల ద్వారా జ్ఞానాన్ని మరింతగా పెంపొందించుకోవచ్చునని ఆ దశగా విద్యార్థులు, యువత గ్రంథాలయాలన్ని సద్వినియోగ పరుచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మండల విద్యాశాఖధికారి 2 మల్లారెడ్డి పద్మనాభం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో ఆ శాఖధికారిని అనురాధ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణా తరగతుల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు గణితంలోని పలు మెలుకువలను తెలపడంతో పాటు వివిధ రకాల చప్పట్లను కొట్టడం తదితర అనేక అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పలువురు విద్యార్థులతొ లేమన్ స్పూన్ ఆటను ఆడిపించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు పలువురు పాఠకులు రాయిల మణికంఠ, గోపి, సంతు, విద్యార్థులు తదితరులున్నారు.

జర్నలిస్ట్ సమస్యలకు పరిష్కారం చూపండి....

విశాలాంధ్ర - ఆమదాలవలస : రాష్ట్రంలో జర్నలిస్టులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వారి సమస్యలను పరిష్కరించాలని ఆమదాలవలస ప్రింట్ మీడియా జర్నలిస్ట్ సంఘం అధ్యక్షుడు గురుగు బెల్లి ప్రసాదరావు, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం శ్రీకాకుళంలో రవికుమార్ ఇంటి వద్ద కలిసి ఎమ్మెల్యేగా ఎన్నికై నందుకు శుభాకాంక్షలు తెలిపారు. గత ప్రభుత్వం జర్నలిస్టులను అనగదొక్కే ప్రయత్నం చేసిందని సమస్యలు ఎత్తిచూపితే విలేకరులపై తప్పుడు కేసులు నమోదు చేయించిందని, బెదిరింపులకు పాల్పడ్డారని అన్నారు. టిడిపి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టినందున జర్నలిస్టు సంక్షేమానికి పాటు పడలన్నారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులు అందరికీ అక్రిడేషన్లు మంజూరు చేయాలని పక్కా గృహాలు నిర్మించి అందించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి పదవి రావడం ఖాయం అని ఈ సందర్భంగా ముందస్తు అభినందనలు తెలిపారు. రవికుమార్ ను కలిసిన వారంలో జర్నలిస్టులు కూన వెంకటరమణ, అన్నెపు రమేష్ తదితరులు ఉన్నారు.